# 2

# సంఘము ఏది కాదు?

*"ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడినపాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను. దేవుని వాక్యమును, అనగా యుగములలోను తరములలోను మరుగు చేయబడియున్న మర్మమును సంపూర్ణముగా ప్రకటించుటకు, మీ నిమిత్తము నాకు అప్పగింపబడిన దేవుని యేర్పాటు ప్రకారము, నేను ఆ సంఘమునకు పరిచారకుడనైతిని. అన్యజనులలో ఈ మర్మముయొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో అది, అనగా మీ యందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతిని దేవుడు తన పరిశుద్ధులకు తెలియపరచగోరి యిప్పుడు ఆ మర్మమును వారికి బయలుపరచెను – ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి ఆయనయెదుట నిలబెట్టవలెనని, సమస్త విధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధిచెప్పుచు, ప్రతి మనుష్యునికి బోధించుచు, ఆయనను ప్రకటించు చున్నాము" (కొలస్సీ. 1:24–28).*

ఆరు సంవత్సరాలకు కొంత ముందుగా నా ప్రియ మిత్రుడొకడు క్రైస్తవుడయ్యాడు. అతనికి క్రైస్తవ మతములోనికి మారినందువల్ల, క్రైస్తవుల ఇంట్లో పెరగడంవల్ల యువకునిగా కలుగవలసిన ప్రయోజనాలు, యౌవన కాలంలో స్నేహితులవలన కలుగవలసిన ప్రోత్సాహం లభించలేదు. అతడు ముప్ఫై సంవత్సరాలు దాటిన తరువాత క్రైస్తవునిగా మారినందువల్ల తాను కోల్పోయిన సమయాన్ని రాబట్టుకోవాలనుకున్నాడు. నేను ఎరిగిన వ్యక్తులందరికంటె ఈ మనిషి చాల త్వరగా ఆత్మ సంబంధంగా ఎదిగాడు. మనలో అనేకులవలె కాక, అతడు "సంపూర్ణంగా ఎదిగిన వాడుగా" దేవుని రాజ్యంలోనికి జన్మించాడా అన్నట్టు పరిస్థితి ఉంది. ఆత్మసంబంధమైన ప్రశ్నలలోకి అతనికి గల అవలోకనము ఎల్లవేళలా సహాయపడేదిగాను, ఆచరణాత్మకమైన జ్ఞానాన్ని వ్యక్తపరచేదిగాను ఉంటుంది. మా మధ్య జరిగిన ఒక సంభాషణలో, అతడు సంఘాన్ని గూర్చి ఒక కామెంట్ చేశాడు. అది నా మనస్సులో యింకను మెదలుతునే ఉంది. క్రైస్తవేతరులకు క్రైస్తవుడు సంఘాన్ని గూర్చి ఏమని చెప్పాలని నేనతని అడిగాను. "సంఘం ఏది కాదో అనేదాన్ని వారికి తెలియజేయి, క్రొత్త నిబంధన సంఘాన్ని గ్రహించడానికి నాకు సహాయపడింది, సంఘం ఏది కాదో అనేదాన్ని వీక్షించడంవలననే"యని అతడు నాతో చెప్పాడు. ఈ

సహోదరుడు ఆరోగ్యకరమైన సలహా చెప్పాడని నేను నమ్ముతున్నాను.

పోలికలు సాదృశ్యాలు ఒక అంశాన్ని విశ్లేషించి చెప్పడానికి ఉత్తమమైన మార్గాలని చెప్పవచ్చు. దోషం ప్రక్కనే దేవుని సత్యాన్ని పెట్టి పోల్చినప్పుడు ఎక్కువ సత్యం స్పష్టంగా కనిపిస్తుంటుంది. తన శిష్యులు ఏమి చేయకూడదో నేర్పించడానికి శాస్త్రుల, పరిసయ్యుల యొక్క ఉదాహరణలను చూపి మత్తయి 23లో ప్రభువైన యేసు ఈ ఉపదేశపు విధానాన్ని ఉపయోగించాడు. "–శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు. గనుక – వారు మీతో చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియలచొప్పున చేయకుడి; వారు చెప్పుదురే గాని చేయరు" అని ప్రభువు తెలిపాడు (మత్తయి 23:2, 3).

సంఘమంటే ఏమిటో క్రొత్త నిబంధన ప్రత్యేకంగా తెలిపింది.[1] అది క్రీస్తు సువార్తకు లోబడినవారితో రూపొందిన ఆత్మ సంబంధమైన శరీరమైయుంది. అంటే, ఆయన జనులైయుండి, ఒక నిర్ణీతమైన ప్రాంతంలో ఆయన ప్రజలుగా పని చేస్తూ ఆరాధించుతూ ఉండేవారే సంఘం. వారు క్రీస్తు నామమును ధరిస్తారు. ఆయనను ప్రభువుగా భావిస్తారు. సజీవుడగు దేవుని ఆత్మ తమలో నివసించు సజీవమైన అవయవములు గల ప్రాణులుగా నెలకొల్పుకుంటారు. ఇలాంటి శరీరంగా రూపొందేవారు ఆయన వాక్యానికి లోబడడం ద్వారా దేవునితోను, క్రీస్తు ప్రభువుతోను, పరిశుద్ధాత్మతోను సన్నిహితమైన సహవాస బాంధవ్యంలో కొనసాగుతూ ఉంటారు.

సంఘమంటే ఏమిటి అన్న పరిచయంతో, సంఘం ఏమి కాదో శ్రద్ధగా పరిశీలించుదాం. క్రొత్త నిబంధన సంఘం ఎలా ఉండాలని దేవుడు ఉద్దేశించాడో దానిని ఈ మార్గంలో ఎక్కువ స్పష్టంగా చూడ నిరీక్షిస్తున్నాం.

## భౌతికమైన ఒక కట్టడం కాదు

మొదట, సంఘము భౌతికమైన కట్టడం కాదు. సంఘపు భవనాన్ని ఒకడు దాటిపోతూ, "అదిగో (చర్చ్) సంఘం!" అని అంటే, అతడు అన్నది తప్పు. సంఘము (చర్చ్) ఇటుకలు, సిమెంట్ వగైరాలతో నిర్మింపబడిన భవనం కాదు. సజీవమైన రాళ్లవలె ఉన్న క్రైస్తవులతో కట్టబడే శరీరం సంఘమని పిలువబడుతుంది (1 కొరింథీ. 12:27; 1 పేతురు 2:5).

సంఘము కూడుకొని ఆరాధించడానికి వారు ఒక కట్టడాన్ని వినియోగించుకొనవచ్చును; గాని సంఘము (చర్చ్) కలప, లోహము, రాయి, గ్లాసు వగైరాలు కాదు. సంఘము సజీవమైన దేహం. "ఆయనలో మీరు కూడ **ఆత్మ**మూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" అని పౌలు ఎఫెసీలోని క్రైస్తవులకు తెలిపాడు (ఎఫెసీ. 2:22). "... మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" అని పేతురు అన్నాడు (1 పేతురు 2:5).

సంఘము భౌతికమైనదనడానికి ఒకే ముఖ్యాంశం సంఘంగా రూపొందినవారి యొక్క భౌతిక దేహాలే. నరుడు అంటే భౌతికమైన దేహంలో నివసించే మానవ ఆత్మయే.

అట్టి మానవుడు క్రైస్తవుడైనప్పుడు, అతడు సంఘమైయుంటాడు. సంఘంగా అతడు నడుస్తాడు, ఆరాధిస్తాడు, ఇష్టపడుతాడు, భౌతికమైన దేహంలో పని చేస్తాడు. సంఘాన్ని స్పృశించి తెలిసికొనగల గుణ లక్షణం అది ఒక్కటే.

అప్పుడప్పుడు, "నేను సంఘానికి వెళ్లుతున్నాను" అని ఒక వ్యక్తి చెప్పవచ్చు. "నేను సంఘకూడికకు వెళ్లుతున్నా"ననే అతని భావం గ్రహించవచ్చు. "సంఘము" అనే పదం క్రొత్త నిబంధనలో సమాజానికి ఉపయోగింపబడింది (1 కొరింథీ. 11:18); అయితే క్రొత్త నిబంధనలో బహు తరచుగా "సంఘము" అనే పద ప్రయోగాన్ని మనం ఆలోచించినట్లయితే – క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన శరీరమనే పేరుగా – "నేను (చర్చ్) సంఘానికి వెళ్లుతున్నాను" అనడం తప్పు. మనం సంఘానికి వెళ్లలేం ఎందుకంటే, సంఘమంటే మనమే! సంఘము లేక క్రైస్తవులు ఆరాధనకుగాని, బైబిలు పఠనానికిగాని కూడికను ఏర్పాటు చేయవచ్చు. అయితే ఒక యింటిలో ప్రవేశించి, దానిలోనుండి బయటికి వెళ్లునట్టుగా, క్రైస్తవుడు ఆరాధనకు మాత్రమే సంఘములో భాగమైయుండి, అటు తరువాత క్రీస్తు ప్రభువు యొక్క దేహాన్ని విడిచి వెళ్లలేడు.

సంఘము భౌతికమైన కట్టడం కానందుకు మనం సంతోషంగా లేమా? అది అలాంటిదే అయితే, అది కేవలం ఒక స్థలములో నిలుపబడినదై, పరిమితిగలదై, జీవము లేనిదియు, ప్రేమలేనిదియునై ఉండేదే. దానికి బదులుగా, సంఘము క్రీస్తు రక్తంచేత విమోచింపబడిన జనముగా, క్రీస్తు ప్రభువు యొక్క ప్రభావాన్ని తక్కిన జనులందరి మధ్యను, లోకమందలి స్థలములలోను కలియ తిప్పుతూ ఉంటారు. క్రైస్తవులు తమ పరలోకపు తండ్రిని ఆరాధించడానికి నిర్ణయించుకున్న ఏ సమయంలోనైనా, ఏ చోటనైనా ఆరాధన జరిగేలా అది సహాయపడుతుంది. క్రైస్తవులు ఎక్కడికి వెళ్లితే సంఘం అక్కడికి వెళ్లుతుంది, ఎందుకంటే క్రైస్తవులే సంఘం.

మనం ఏమి అంటున్నామో, చేస్తున్నామో జాగ్రత్తపడదాం. ఎందుకంటే, మనం క్రీస్తు సంఘంగా మాట్లాడతాం, కార్యాలు జరుపుతాం. మనం కూడి, ఆరాధించేటప్పుడు మాత్రమే మనం ఆయన సంఘం కాదు. మనం ఎక్కడ ఉన్నా ఆయన సంఘంగానే ఉన్నాం. "తన సొత్తయిన ప్రజలుగా ఉండడానికి" గాను ఆయన మనలను బయటికి పిలిచి తన స్వరక్తంతో పరిశుద్ధపరచి పరిశుద్ధులనుగా ఆయన మనలను నిలబెట్టాడు. దేవుడు మృత సాదృశ్యమైన, ప్రాణ రహితమైన శరీరాన్ని కాక, క్షమింపబడినవారైయుండి, ఎన్నుకున్న జనులతో కూడిన సజీవమైన కుటుంబం కలవాడు. ఆయన సంఘము ఆత్మ సంబంధమైన జనాంగం, రాజులైన యాజక సమూహం, ఆయన సహవాసానికి తగిన సమాజం (1 పేతురు 2:9).

## స్నేహ సంబంధమైన సమాజం కాదు

రెండవది, సంఘమనేది ఒక సాంఘికమైన క్లబ్బుకాదు. అది స్ఫూర్తినిచ్చే స్నేహమో, యితరులతో ఉల్లాసపూరితమైన సాంగత్యమో కాదు.

సహవాసం సంఘమిచ్చే తక్షణ ప్రయోజనమే అయితే, సంఘమనేది సహవాసం

కంటె మించినది. ఒక వ్యక్తి మార్పు చెందినప్పుడు, ఆత్మ సంబంధమైన మరణంనుండి లేవనెత్తబడినవాడై, క్రీస్తు ప్రభువు శరీరమందు మిగతా క్రైస్తవుల ప్రక్కనే ఆసీనుడు కావింపబడతాడు. ఇందును గూర్చి పౌలు యిలా వ్రాశాడు,

> అయినను దేవుడు కరుణాసంపన్నుడైయుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతోకూడ బ్రదికించెను. కృపచేత మీరు రక్షింపబడి యున్నారు. క్రీస్తు యేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము క్రీస్తుయేసునందు మనలను ఆయనతో కూడ లేపి, పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండ బెట్టును (ఎఫెసీ. 2:4-7).

తన కుమారుని బలివలన దేవుడు మనలో ఎవరికి విమోచనమిచ్చెనో, వారిని ఆయన ఆత్మ సంబంధమైన తన కుటుంబంగా స్వీకరించి, “నాయనా! తండ్రీ! అని మొఱ్ఱపెట్టు తన కుమారుని **ఆత్మ**ను దేవుడు మన హృదయములలోనికి పంపాడు” (గలతీ. 4:6). దేవుని కుటుంబంగా సంఘము గాఢమైన అన్యోన్య సంబంధాలు కలిగించేదిగా ఉంటుంది. అయితే దేవునితో మనకున్న కుటుంబ సంబంధమైన బాంధవ్యంతోనే ఈ సహవాసం వృద్ధి చెందుతుంది. ఇందు విషయమై అపొస్తలుడైన యోహాను యిలా వ్రాశాడు: “యేసే క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవునిమూలముగా పుట్టియున్నాడు. పుట్టించిన వానిని ప్రేమించు ప్రతివాడును ఆయన మూలముగా పుట్టినవారిని ప్రేమించును” (1 యోహాను 5:1).

---

**దేవునికి మృతతుల్యమైన దేహమో, ప్రాణములేని వస్తువో కాక, క్షమించబడి ఏర్పరచబడిన జనులతో నిర్మింపబడిన సజీవమైన కుటుంబమున్నది.**

---

నీ బాల్యంలోనే నీ తలిదండ్రులు చనిపోతే, ఆవశ్యకతను బట్టి నువ్వు అనాథాశ్రయంలో చేర్చబడ్డావు. “నిరాశ్రయుడు” అన్న పదానికి అర్థంగా ఒంటరితనం, నిర్లిప్తత, బాంధవ్య రహితమైన వేదనలను అనుభవిస్తావు. సంవత్సరాలెన్నో గడిచాయి, సొంత కుటుంబం ఉండడం అంటే ఏమో కూడా నీవు మరచిపోయావు. ఒక దినాన నీవు అద్భుతమైన కుటుంబంచేత దత్తత తీసికొనబడ్డావని అనుకుందాం. నీవు యిప్పుడు ప్రేమ, గుర్తింపు, ఆదరణలుగల నూతన ప్రపంచంలోనికి వచ్చావు. వెంటనే, నిన్ను ప్రేమించి, ఆదరించి, నీ అవసరాలను తీర్చే తండ్రి నీకిప్పుడున్నాడు. నీ తల్లినుండి మృధువైన, అనురాగాన్ని, అప్యాయతను పొందుతావు. అక్కలు, అన్నలతో కలిసి కుటుంబ బాంధవ్యం పెరిగి మమకారం పెనవేసుకొంది. నీకు అనే భవిష్యత్తు రూపుదిద్దబడుతూ, కుటుంబ సహజీవనంతో నీకు అందమైన రోజులు వచ్చాయి. కాలం గడిచేకొలది, గాఢమైన కుటుంబ మమకారాలు నీ అనుభవంలోనికి వచ్చాయి. ఇంతకు దీనినంతటిని

సమకూర్చినదేది? సాంఘికమైన క్లబ్బువలనగాని స్నేహబంధంవలనగాని యిదంతా ఏర్పడిందా? లేదు. నీవు ఒక కుటుంబంలోనికి దత్తతగా వచ్చావు. ఆ కుటుంబంలో విడదీయలేని ఒక భాగంగా మారావు. ఆ కుటుంబంలో భాగంగా మారినందువల్ల ఆ దీవెనలు సహవాసము నీకు కలిగాయి.

ఇప్పుడు, నూతనంగా క్రైస్తవుడైనవానికి కూడా యిలాటి మార్పే జరుగుతోంది. నూతన కుటుంబం, అంటే – దేవుని కుటుంబంలో అతడు నిలుస్తాడు. ఈ విధానాన్ని వర్ణించడానికిగాను పౌలు "(దత్త) స్వీకారము" అనే పదాన్ని కూడా వాడాడు (ఎఫెసీ. 1:5).

తన జీవితాన్ని ఏ విధమైన మార్పు చేసికొనకుండగనే ఒకడు క్లబ్బులో సభ్యుడై యుండవచ్చు. క్లబ్బు అనేది జీవన వ్యవహారానికి అతికించుకున్న "మరొక" అట్టలాంటిది. మనకు సరిపడకపోతే ఎప్పుడైనా దాన్ని వదలుకోవచ్చు. అది మన ఉల్లాసానికిగాను వినోదానికిగాను ఉంటుంది. కుటుంబ ప్రవేశమైతే అందుకు పూర్తిగా వ్యత్యాసమైనది. నీవు ఆ కుటుంబంలో ప్రవేశించినప్పుడు, ఆ కుటుంబం నీలో ప్రవేశిస్తుంది. నీ జీవితానికి అది ఒక "అనుబంధమైన దీవెన కాదు." దాని పేరు నీవు పెట్టుకుంటావు; అందులో ఉన్న సభ్యులందరు నీవారే ఔతారు, నీవు వారి వాడవౌతావు. జీవితంలోని యితర బాంధవ్యాలన్నిటికంటె కుటుంబంలోనికి నువ్వు పూర్తిగా మలచబడతావు.

దేవుని కుటుంబంలో ప్రవేశించే వారందరు క్రొత్త జన్మద్వారా అందులోనికి ప్రవేశిస్తారు (యోహాను 3:5). నీవు దానిలో "చేరలేవు"; నీవు దానిలో జన్మించాలి, లేక దత్తత చేయబడాలి. మార్పు లేకుండ ఎవరును ఆ కుటుంబంలో ప్రవేశింపలేరు. మనం క్రీస్తు వారమైనప్పుడు, క్రీస్తు నామమును ధరించినవారమై, "క్రైస్తవుల"మనబడతాం. మన బాంధవ్యాలలో మార్పుగలవారమై ఉంటాం, మన ప్రవర్తన, మన ఆశలు మారిపోతాయి. మనం ఒకే కుటుంబంగా రూపొంది, దేవునిచే పోషింపబడి నడిపింప బడతాం. ఆయన మనకు కావలసినవాటిని ప్రసాదిస్తూ కాపాడుతూ ఉంటాడు. ప్రభువైన యేసు రక్తంచేత బంధింపబడినవారమై దేవుని పిల్లలముగా ఎడతెగని సహవాసములో కొనసాగుతూ, మనం జీవించి, ఆరాధించి, పని చేస్తూ ఉంటాం.

## మానవ యోచన కాదు

మూడవది, సంఘము కేవలం మానవుని యోచనవలన కలిగింది కాదు. అది ఏ నరునివలన సూచింపబడినది కాదు లేదా కనిపెట్టబడింది కాదు. అది నరునివలన అజమాయిషీ చేయబడేదో, నిలబెట్టబడేదో కాదు.

సంఘము దేవుని యోచనయు, ఆయన సృష్టియునైయుంది. లోకాన్ని దాని ఉనికి లోనికి వచ్చేలా ఆయన పలుకకముందు, మానవ రక్షణ కొరకు ఆయన సిలువను సంఘాన్ని సంకల్పించియున్నాడు. మొదటి పాపానికి ముందుగానే, ఆయన క్షమాపణా విధానాన్ని గూర్చి ఆలోచించాడు. దేవుడు తొలి నక్షత్రాన్నో, లేక గడ్డిపుచనో చేయకముందు, క్రీస్తు శరీరమందు ప్రవేశించేవారిని రక్షించాలని దేవుడు ఎంచుకున్నాడు. అందువలన క్రైస్తవులు, "తండ్రియైన దేవుని భవిష్యద్ జ్ఞానమునుబట్టి, ఆత్మవలని పరిశుద్ధత పొందిన

వారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడిన వారై" ఉన్నారు (1 పేతురు 1:1, 2). దేవుని పరిశుద్ధులు, అంటే – గొఱ్ఱెపిల్ల యొక్క రక్తముచేత విమోచింపబడినవారు, జగదుత్పత్తి మొదలుకొని వధింపబడిన గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడినవారని ప్రకటన 13:8 వర్ణిస్తుంది. సిలువద్వారా రక్షింపబడడానికి ఎవరు కోరుకుంటారో వారిని – కేవలం వ్యక్తిగతంగా కాక – సమూహంగా రక్షించాలని దేవుడు కోరుకున్నాడు. చిందింపబడిన క్రీస్తు రక్తము యొక్క ఫలితమే సంఘము నాడు నేడు అయ్యున్నది. క్రీస్తు ప్రభువు యొక్క రక్తంతో కడుగబడినవారు రాజ్యంగా చేయబడ్డారని యోహాను తెలియజేశాడు (ప్రకటన 1:5, 6).

ఈలాటి ఆలోచనవల్ల ఒక కీలకమైన సత్యం మన మనస్సును దహిస్తూ పోతుంది: లోకారంభానికిముందే క్రీస్తు బలి దేవుని చిత్తమైయుండి, సంఘము క్రీస్తు రక్తముచేత సృజింపబడినదైతే, సంఘము దేవుని నిత్య సంకల్పములో ఉన్నదని రుజువౌతుంది. అందువలన, ఎఫెసీ. 3:10, 11లో అపొస్తలుడైన పౌలు ఈ సత్యాన్ని ప్రస్తావిస్తే, మనం ఆశ్చర్యపోనవసరం లేదు.

> దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘముద్వారా తన యొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి ...

క్రీస్తు యొక్క అపొస్తలునిగా పౌలుకు అధికారం లేదని నిరాకరించారు. గలతీయలోని కొద్దిమంది అందువల్ల, దైవ ప్రేరేపితమైన సందేశాలుగా వారతని మాటలను అంగీకరించడం లేదు. ఈలాటి వారి నేరారోపణకు జవాబుగా తాను వారికి వ్రాసిన ఉత్తరంలోని తొలి భాగమందు వివరించాడు: "మనుష్యుల మూలముగానైనను ఏ మనుష్యుని వలననైనను కాక, యేసుక్రీస్తువలనను, అయనను మృతులలోనుండి లేపిన తండ్రియైన దేవునివలనను అపొస్తలుడుగా నియమింపబడిన పౌలను నేనును ..." (గలతీ. 1:1). క్లుప్తంగా చెప్పినా, పౌలు యొక్క వాదమేమంటే – తన అపొస్తలత్వము మనుష్యులవలన కలిగింది కాదు, మనుష్యులు దానిని తనకు యివ్వలేదు అనేదే. "నా అపొస్తలత్వము నేరుగా పరలోకంనుండి యేసుక్రీస్తు ద్వారా వచ్చింది" అని అతడంటున్నాడు.

తన అపొస్తలత్వాన్ని గూర్చి ఏమి చెప్పుకున్నాడో, సంఘాన్నిగూర్చి కూడా అదే చెప్పవచ్చు: సంఘము మనుష్యులనుండి కలిగింది కాదు. అది దైవికమైనది. అది పరలోకము–సంకల్పించింది, పరలోకము–ప్రకటించింది, పరలోకము–పంపింది. దీనిని గూర్చిన భావన దేవుని మనస్సులో ఉద్భవించింది. దీనికి సంబంధించిన ఆలోచన, ప్రభువైన యేసు యొక్క సిలువ మరణంచేతను, పెంతెకొస్తు దినాన అద్భుతరీతిగా కుమ్మరింపబడిన పరిశుద్ధాత్మ కార్యంచేతను అమలుపరచబడింది. ప్రజలు సంఘంలో ప్రవేశించి, ప్రభువు వాక్యంచేతను, పరిశుద్ధాత్మ వారి అంతరంగంలో నివసించుటవల్లను నిలబెట్టబడతారు. అది క్రీస్తు ప్రభువుకు చెందింది. అందువల్ల, దాని గొప్పతనం మానవుని తలతోను లేక చేతులతోను అధికం చేయబడదు. మరియు దాని మహిమను ఏ మనిషి యొక్క మనస్సుకో లేక కండరాలకో చేర్చలేం.

ఒకడు సంఘంలో ప్రవేశించినప్పుడు, అతడు ఒక మానవ సంస్థలోనో లేక ఒక మత శాఖలోనో ప్రవేశింపడు. లోక సంబంధమైన జ్ఞానము, శక్తి, ఉపాయాలు, లేక బలము అనే వాటిమీద మన నిత్య నిరీక్షణ నిలుపుకోవాలని దేవుడు మనలను కోరలేదు. దైవికంగా సృజింపబడిన క్రీస్తు శరీరంలో ప్రవేశించమని ఆయన మనకు అదేశించాడు. దాని వెనుకను దానియందును దేవుని జ్ఞానముంది. ఆత్మ సంబంధమైన ఆ శరీరము ఆయన శక్తివలన నిర్మింపబడింది. నిరంతరము అది ఆయన కృపచేతను నడిపింపుచేతను కాపాడబడుతుంది.

ఆ సంఘంలో ప్రవేశించే ఏకైక మార్గం లేఖనములయందు బయలుపరచబడిన దైవప్రేరేపితమగు సువార్తకు లోబడడమే (2 థెస్స. 1:7–9). క్రీస్తు ప్రభువు యొక్క నమ్మకమైన సంఘంలో కొనసాగడానికి గల ఒకే ఒక మార్గం – లేఖనములయందు కన్పించే క్రైస్తవ జీవితపు నమూనాను అనుదినం అనుసరించడమే (1 యోహాను 5:2, 3). ఈ సంఘానికి లేఖనాలు తప్ప ఏ మత సిద్ధాంతమూ లేదు, క్రీస్తు తప్ప ఏ శిరస్సూ లేదు.

## దైవికమైన సర్దుబాటు కాదు

నాల్గవది, సంఘము విఫలమైన ఏర్పాటుకు మారుగా వచ్చింది కాదు, దేవుని మనస్సులో ఉన్న ఒక ఉన్నతమైన సంస్థకు బదులు దాని స్థానంలో నిలిపిన ఏర్పాటు కాదు. సంఘమంటే లోకంలోని పాప భూయిష్టతను బట్టి, తాను తలంచిన ఉన్నతమైన ఏర్పాటును అమలు చేయలేకపోయినందున, దాని స్థానంలో దేవుడు నిలుపనుద్దేశించినది కాదు.

ఆరంభ కాలంనుంచి దేవుడు తన కార్యాలను చేస్తూ చేయిస్తూ వచ్చింది సంఘ యుగంవైపుకే. రానున్న రాజ్యాన్ని గూర్చిన సమాచారం ప్రవక్తలు క్రమబద్ధంగా ప్రవచించుతూనే వచ్చారు. తన భూ నివాస కాలపు పరిచర్యలో ప్రభువైన యేసు “కాలము సంపూర్ణమైయున్నది, దేవుని రాజ్యము సమీపించియున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని” చెప్పుకొంటూ వచ్చారు (మార్కు 1:15). సిలువ సమీపించుతూ ఉండగా ప్రభువు తన అపొస్తులులకు యిలా తెలియజేశాడు:

> మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువవేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను (మత్తయి 16:18, 19).

ఆయన రాజ్యస్థాపనకు కొద్ది రోజుల ముందుగా ప్రభువు వారితో – “కొద్ది దినముల లోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను” (అపొ. 1:5). పెంతెకొస్తు దినాన అపొస్తలుల మీద పరిశుద్ధాత్మ కుమ్మరింపబడ్డాడు, వారు పరిశుద్ధాత్మ యొక్క శక్తిలోను ప్రభావంలోను బాప్తిస్మం పొందారు. అపొ. 2:11–15లోని అద్భుతమైన ఆ సంఘటన యోవేలు ప్రవచనపు నెరవేర్పు అయ్యున్నట్టునూ (యోవేలు 2:28–31),

"అంత్యదినము"లని క్రైస్తవ యుగాన్ని గూర్చి అది ప్రవచించినట్టునూ, అది దేవుని రాజ్యపు యుగమై ఉన్నట్టునూ పేతురు గురుతు చూపాడు. ఆ విధంగా, ఆయన రాజ్యము యొక్క భూ సంబంధమైన రూపుగా సంఘము స్థాపింపబడింది, అది దేవుని యొక్క కాలమానం ప్రకారమును దేవుని విధానంలోను స్థాపింపబడింది.

అందరివలన కాకపోయినా, అనేకులవలన ఆదరింపబడుతున్న పదుగురెరిగిన మత సంబంధమైన దోషముంది: మత శాఖల ప్రపంచం దాన్ని "వెయ్యేండ్ల పరిపాలన" అని పిలుస్తుంది. ప్రకటన 20:1–4లోని సాంకేతిక భాషమీద దాదాపుగా ఆధారపడి, "pre" అంటే "ముందు," మరియు "millennial" అంటే "వెయ్యేండ్ల పరిపాలన" అనే సిద్ధాంతాన్ని కట్టారు. కాలాంతమందు క్రీస్తు ప్రభువు వచ్చి వెయ్యేండ్లు పరిపాలిస్తాడని లేఖన విరుద్ధమైన బోధను వారు బోధిస్తారు. యేసు భూమి మీద రాజుగా వచ్చి తన రాజ్యాన్ని వెయ్యి సంవత్సరాలు పాలిస్తాడని, అక్షరార్థంగా యెరూషలేములో భౌతికమైన దావీదు సింహాసనం మీద ఆయన కూర్చుంటాడని వారు చెప్తారు. ఆ కాలంలో ఇశ్రాయేలు పాలస్తీనా దేశంలో పునరుద్ధరించబడతారని, భూలోక రాజ్యాల మీద ఏలికలై ఉంటారని వారు అంటారు. క్రీ.శ. 70లో టైటస్‌చేత నాశనం చేయబడిన దేవాలయం పునర్నిర్మాణం చేయబడుతుందనియు, తిరిగి లేవీ యాజక ధర్మానికి సంబంధించి బలులు వగైరాలు తిరిగి ప్రవేశపెట్టబడతాయని వారి నమ్మకం. యేసు తొలిసారి వచ్చినప్పుడు రాజ్యం స్థాపించ పూనుకున్నాడు, అయితే ఆ ప్రయత్నం నిరాకరింపబడింది. గనుక రాజ్యం స్థానంలో సంఘం స్థాపింపబడింది – అని వెయ్యేండ్ల పరిపాలనా వాదులు నమ్ముతారు. అందునుబట్టి రాబోయే అసలైన రాజ్యానికి మారుగా సంఘమనేది ఒక తాత్కాలికమైన ఏర్పాటని వెయ్యేండ్ల పరిపాలనా వాదులు తలుస్తారు.

సంఘము, రాజ్యమనేవాటిని గూర్చి అల్లుకున్న ఆలోచనలో కేవలం ఒక విషయం తప్పు: అది తప్పు. మనుష్యునికున్న వింతైన సిద్ధాంతాలనుండి అది పెంపొందింది కాని దేవుని వాక్యంవలన కాదు. ఒకదాని వెంట ఒకటిగా ఉన్న విషయాన్ని తప్పుగా రుజువు చేయడానికి బదులు, ఎఫెసీ 3:11లో సంఘము దేవుని నిత్యసంకల్పమైయుందనే పౌలు యొక్క ప్రకటనను నమ్మితే సరిపోతుంది. ఒకే ఒక ప్రతిపాదనతో అసత్య బోధను సంపూర్తిగా అతడు ఓడిస్తున్నాడు. ఈ సందర్భంలో ఒక ఔన్సు పరిమాణంలోని సత్యం ఒక టన్ను పరిమాణంలో ఉన్న దోషాన్ని పరిహరిస్తుంది. సంఘమనేది – దేవుని సంకల్పానికి అనుబంధమో, "జత చేయబడిందో" కాదు – అది దేవుని సంకల్పమే అయ్యుంది.

బదులుగా ఉన్నది ఎల్లప్పుడు – రెండవ రకంగాను, శ్రేష్ఠమైనదాని స్థానంలో ఉన్నదిగానూ ఉంటుంది. నీ హృదయం యాకోబును తలచుకుంటోందా, యాకోబు రాహేలును వలచి వివాహం చేసుకోవాలని అనుకున్నాడు. కాని ఆమెకు బదులుగా అతనికి మోసంతో లేయానిచ్చి వివాహం చేసారు (ఆదికాండం 29:16–25)? నీవు ప్రేమించిన స్త్రీకి బదులుగా నీ వివాహ దినాన వేరొకతెను పెండ్లి కుమార్తెగా, నీ ప్రేయసిగా పొందవలసి వస్తే ఎలాగుంటుంది?

యాకోబు పట్ల మనకు సానుభూతి కలుగుతుంది ఎందుకంటే ఎవడును అనుకరణతో

నిజంగా తృప్తి పొందదని మనకు తెలుసు, అనుకరణకంటె నిజమైనదే ఎప్పుడు అభిలషింపబడుతుంది. సంఘము అధికారికమైనది, బదులుగా ఏర్పాటు చేయ బడినది కాదు.

క్రొత్త నిబంధన సంఘము రాజ్యమును గూర్చిన ప్రవచనాల యొక్క మహిమా యుక్తమైన నెరవేర్పైయుందని సంఘం యొక్క సహజత్వాన్ని, ప్రాముఖ్యతను దేవుడు మనకు చూపుతున్నాడు. "అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" అని పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 5:26బి, 27).

సంఘము దేవుని ప్రథమ ఎన్నిక, శ్రేష్ఠమైనదానికి బదులుగా నిలిచింది కాదు. ఈ విషయమై నీవు నాతో అంగీకరించావా? పాప మానవుని పట్ల దేవుని జ్ఞానయుక్తమైన ఏర్పాటుకును, కనికరముగల ఆయన కార్యంలో భాగంగా ఉండగోరి మనం సంఘంలో భాగమై ఉంటాం. ఈ క్షణం ప్రార్థనయందు దేవునికి స్తుతి, కృతజ్ఞతలు చెల్లించుదాం: సంఘము మన విమోచన కొరకు దేవుని నిత్యసంకల్పమై ఉంది. అది కేవలం వెలితిని నింపడానికి ఉద్దేశింపబడింది కాదు.

## ముగింపు

ఏది క్రొత్త నిబంధన సంఘం కాదో గమనించడంవలన సంఘమంటే ఏమో మనం చూడలేమా? సంఘము భౌతికమైన కట్టడం కాదు; అది ఆత్మ సంబంధమైన క్రీస్తు శరీరమైయుంది. అది సాంఘీకమైన క్లబ్బు కాదు; అది ఆత్మసంబంధమైన దేవుని కుటుంబం, క్రొత్తగా జన్మించినవారు అందులో ప్రవేశిస్తారు. అది మానవుని తలంపు కాదు; సిలువ ద్వారా అది దేవుని ఆలోచనయు వాంఛయునై ఉన్నది. దేవుడు కలిగియున్న నిజమైన ఉద్దేశానికి అది బదులుగా ఉన్నది కాదు. దేవుని నిత్యసంకల్పానికిని రాజ్యానికి సంబంధించిన ప్రవచనాలకును అది నెరవేర్పైయుంది. ఒకడు ఆ సంఘమందు ప్రవేశించి నప్పుడు, నిత్యకాలంనుండి గల దేవుని సంకల్ప మంతటిలో అతడు ప్రవేశిస్తాడు.

ఇంటికి వచ్చిన అతిథులు నీ పేరేమని ఆ యింటి పసి బాలుని అడిగారు. "నా పేరు క్విట్" అని అతడు బదులిచ్చాడు. అనుమానించుతూ, ఆ అతిథులు – "నీ పేరు క్విట్ అని నీకు ఎలా తెలుసు?" అని అడిగాడు. పైకి కన్నెత్తయినా చూడకుండ, "ప్రజలు నా వైపు ఎప్పుడు చూచినా, 'క్విట్' అని అంటారని అతడు ప్రత్యుత్తరమిచ్చాడు." ఆ పసివాడు ఆ ఆక్షేపణకు ఎంతగా కనీసం – తన మనస్సులో కూడ అలవాటు పడ్డాడంటే వ్యతిరేకంగా మారిపోయాడు. అతని పేరు క్విట్గా అయ్యింది.

సంఘమంటే ఏది కాదో మనం చదివేటప్పుడు, అలాటి అపాయం మనలను ఆవరింపవచ్చు. సంఘమంటే "లేదు" అనే వాటి సమూహంగా మారిపోకూడదు. క్రైస్తవుడనే వాడు కేవలం "వ్యతిరేకి" కాదు, తాను దేనిని వ్యతిరేకిస్తున్నాడో దాన్ని మాత్రమే పట్టుకొని

తిరగకూడదు. వ్యతిరేకతలు అనుకూలతలను బలపరచడానికి ఉద్దేశింపబడ్డవే. సంఘము ఏది కాదో చూడడంలో సంఘం ఏమైయుందో తీర్మానించడానికి సహాయం పొందడమే ఉద్దేశం.

సంఘంగా, క్రీస్తు ప్రభువుకు మనం శిష్యులంగా, సేవకులంగా, అనుసరించువారుగా అయ్యుంటాం. ఆయన చిత్తానికి నమ్మకంగా లోబడడంవల్ల మనం ఆయన ఆధిపత్యం క్రింద జీవిస్తాం. దేవునికిని, క్రీస్తు ప్రభువుకును, పరిశుద్ధాత్మకును విధేయతతో కూడిన విశ్వాసం మన దైనిక ప్రత్యుత్తరమై ఉంటుంది. మనం సంఘాన్ని దేవుని రాజ్యము, క్రీస్తు శరీరము, లేక దేవుని కుటుంబం అనే ఏ దృష్టితో చూచినా, క్రైస్తవుని యొక్క ప్రత్యుత్తరం నిరంతరం విశ్వాసముతో కూడిన విధేయతయే అయ్యుండాలి. ఆయన వాక్యం యొక్క సాక్ష్యం ద్వారాను, జీవితం యొక్క సాక్ష్యం ద్వారాను మనం చూచేది – ఒక పాపి క్రీస్తు సంఘంలోనికి ప్రవేశించవలసిన అవసరమే. ఇదే మహా గొప్ప అవసరతయై ఉంది. అలా ప్రవేశించి, క్రీస్తు ప్రభువు మనలను యింటికి పిలిచేవరకో, ఆయన వచ్చి మనలను కొనిపోయేవరకో స్థిరమైన విశ్వాసం కలిగి ఆయన ఎదుట నమ్మకంగా నడువవలసియుంది.

నువ్వు రాహేలును వివాహం చేసుకోగలిగినప్పుడు లేయాతో సర్దుబాటు కాకు! నువ్వు క్రీస్తు స్థాపించిన నిజమైన సంఘంగానే ఉండగలవు.

## పఠనము, చర్చ కొరకైన ప్రశ్నలు

1. సంఘం ఏది కాదో చూడడం ఎందుకు సహాయకరంగా ఉంటుంది?
2. లేఖనాల్లో చెప్పబడినట్టు సంఘాన్ని గూర్చి క్లుప్తంగా నిర్వచించు.
3. భౌతికమైన ఆరాధన స్థలంతో సంఘం ఎలాటి సంబంధం కలిగియుంటుంది?
4. సంఘము భౌతికమైన స్థలం కానందున నీకు కన్పించే ఉపయోగాలేమి?
5. ఇతరులతో సహవాసం కలిగియుండే దానికంటే సంఘం ఎలా అధికమై ఉంటుంది?
6. ఆత్మసంబంధమైన కుటుంబంలో భాగమైయుండడం అంటే అర్థమేమి?
7. దేవుని కుటుంబంలోనికి ప్రవేశించేది ఎలాగు?
8. సంఘము దేవుని ఉద్దేశమేగాని మానవునిది కాదని లేఖనములనుండి రుజువు చేయుము.
9. సంఘము మారుగా వచ్చింది కాదని, దేవుని అనాది సంకల్పంలో అది భాగమని లేఖనములనుండి రుజువు చేయుము.
10. సంఘము ప్రవచనపు నెరవేర్పైయున్నదనడానికి లేఖన భాగాలను సూచించుము.
11. విధేయతతో కూడిన విశ్వాసమంటే ఏమి?
12. సువార్త పట్ల మన దైనిక ప్రత్యుత్తరం ఏమైయుండాలి?

## సూచనలు

[1]"సంఘము" పైన వరుస రచనల్లో యిది మూడవ పుస్తకం. ఈ వరుసలో మిగిలిన రెండు: "సంఘమనగా నేమి"? "సంఘము కొరకైన దేవుని నమూనా" అనేవి. ఆ రెండును రచయితచేత సెర్సీ, ఆర్కన్‌సాస్‌లో ప్రచురింపబడ్డాయి. క్రొత్త నిబంధన సంఘమును గూర్చి యింకను ఆలోచించగోరితే, ఈ రెండు పుస్తకాలు సిఫారసు చేయబడుచున్నాయి.